వైవీ రావు మృతి ఉద్యోగ సంఘాలకు తీరని లోటు

విశాలాంధ్ర - అమలాపురం : ఏపిఎస్ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వైవీ రావు సంతాప సభను గురువారం అమలాపురం బస్టాండ్ ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రావుల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థి దశనుండే కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడైన వైవి రావు విజయవాడ నగరంలో సీపీఐ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపిజెఏసి అమరావతి కోనసీమ శాఖ చైర్మన్ డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపిజెఏసి అమరావతి సెక్రటరీ జనరల్‌గా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై గళమెత్తి ప్రభుత్వాన్ని ఒప్పించి 11వ పిఆర్‌సిని సాధించడంలో వైవి రావు పాత్ర మరువలేనిది చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి. చిరంజీవి మాట్లాడుతూ ఆర్టీసి లో డిపో కార్యదర్శి నుండి రాష్ట్ర అధ్యక్షులుగా అనేక పదవులు చేసిన ఆయన ఆర్టీసి ఉద్యోగుల సమస్యలపట్ల అవగాహన ఉన్న నాయకునిగా ప్రభుత్వంలో విలీనం తరువాత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అటు ప్రభుత్వం దృష్టికి, ఇటు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించడంలో ఆయన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. ఈ సంతాప సభకు కోనసీమ జిల్లాలోని డిపోల అధ్యక్ష కార్యదర్శులు పివి రమణ, ఎస్ఎస్‌వి గణేష్, కె హనుమంతు, ఎంఎస్ఆర్ మూర్తి, డివి రావు, వివిఎల్ నారాయణ, డి. రాధాకృష్ణ, జి అనంతలక్ష్మీ, నాగలక్ష్మి, సుశీల హిమబిందు, పి సత్తిబాబు, రంగ ప్రసాద్, మెడిది శ్రీను, జాంగా నాగేశ్వరరావు, కెవిఎస్, మన్యం ఆదినారాయణ, మస్తాన్, వరహాలబాబు, రవికుమార్, డిపో కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

28న గోకవరం మండల పరిషత్తు సమావేశం

విశాలాంధ్ర - గోకవరం: ఈనెల 28వ తేదీన ఉదయం 10:30 కు గోకవరం మండలం ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ హాలులో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సుండం శ్రీనివాసు దొర గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీత,, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతిని చంటిబాబు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ సభ్యులు ఐ వెంకటేశ్వరరావు, షేక్ షాక్ సబ్జి, గోకవరం మండల పరిషత్ అధ్యక్షురాలు సుంకర శ్రీవల్లి, హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీవో చెప్పారు. ఈ సమావేశానికి అధికారులతో పాటు గోకవరం మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల సర్పంచులు హాజరు కావాలని ఎంపీడీవో ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఎర్రంనాయుడు జయంతి

విశాలాంధ్ర - తాళ్లపూడి : ప్రముఖ టీడీపీ నాయకులు, కింజరాపు ఎర్రంనాయుడు జయంతి వేడుకను అన్నదేవరపేట టిడిపి కార్యాలయంలో విక్రమాదిత్య యువ సేన జరుపుకున్నారు. అయన జ్ఞాపకాలని స్మరించుకుంటూ ఆయన ఆశయాలను బతికించుకుని చంద్రబాబు ను ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. ఇటీవల గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై, టీడీపీ నాయకులపై జరిగిన దాడిని ఖండించారు. రాబోయే రోజుల్లో ఈ వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తప్పక బుద్ధి చెపుతారని, వైసీపీ అరాచక అవినీతి పరిపాలనని ఎండగట్టి తెలుగుదేశాన్ని గెలిపించుకుంటామని అన్నదేవరపేట టీడీపీ యువగళం పేర్కొంది. ఈ కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్రప్రసాద్, కూచిపూడి గణపతి, తొండెపు భరత్, జగన్, నరేంద్ర, బంగార్రాజు, రమణ, పండు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను గుర్తించిన ఏకైక ప్రభుత్వం వైసీపీ

విశాలాంధ్ర - మండపేట : మాదిగలను గుర్తించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్సీపీ ప్రభుత్వమని ఎస్సీ నాయకులు ఉండ్రాజపు అర్జున్, ముమ్మిడివరపు బాపిరాజు, పలివెల సుధాకర్‌లు ఉద్ఘాటించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ పదవి రావడంతో మండపేటలో ఆ సామాజిక వర్గం నాయకులు సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గంలోని నాయకులంతా కలిసి 7వ వార్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించి సీఎం జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం సువర్ణ అధ్యాయమన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో మాదిగలను గుర్తించిన పార్టీ ఏదైనా ఉందంటే వైసీపీ ఒక్కటేనని పేర్కొన్నారు. బాపిరాజు, సుధాకర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ నాయకులు చంద్రమళ్ల రామకృష్ణ, కొడమంచిలి భాస్కరరావు, గనిపే నాగభూషణం, కొడమంచిలి వీర్రాజు, చంద్రమళ్ళ బుల్లి వీరయ్య, బూర చిన్ని, పైడిమళ్ళ రాజు, బూర అమ్ములు, మడికి ఆనందరావు, కొల్లి చిన్న, కొమ్ము సూరిబాబు, పలివెల జేజిబాబు, యార్లగడ్డ ప్రసాద్, చుండూరు సత్తిబాబు, పెనుమచ్చి బాబూ సుకుమార్, శాంతిరాజు, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా గొడుగు కనకరత్నం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : జై భీమ్ భారత పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గొడుగు కనకరత్నం, పోతురాజు శ్రీనులను ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు ప్రకటించారు. మండలంలోని లింగపర్తి గ్రామంలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో దాడిశెట్టి మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలపరిచేందుకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కమిటీల ద్వారా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. ప్రత్తిపాడు నియోజవర్గం యువజన విభాగం అధ్యక్షులుగా గాది గౌతమ్ నియమించినట్టు తెలిపారు.

తహసీల్దార్‌గా ఎన్‌విఎస్ సురపరాజు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరం మండల తహసీల్దారుగా ఎన్‌విఎస్ సురప రాజు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ ఏ. విశ్వనాథ శాస్త్రి డిప్యూటేషన్ పై కాకినాడ వెళ్లడంతో ఆయన స్థానంలో సురపు రాజు కాకినాడ నుండి డిప్యూటేషన్ పై ఏలేశ్వరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన అనుభవం ఉందన్నారు. మండలంలోని భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఆర్ఐ ఎస్.పొన్నాల, వీఆర్వోలు తహసీల్దార్‌కు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర - అంబాజీపేట : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు అంబాజీపేటకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని తిమూర్తులు తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులను పలువురు అభినందించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో 28వ ఇంటర్ క్లబ్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 19వ తేదీన జరిగాయన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో కె.అన్య, ఎం.మౌనిక, బీహెచ్, ప్రితిక్‌లకు, ప్రథమ స్థానంలోను, జి లహితాదేవి, జి పూజితాదేవి, ఎంఎస్ఎస్ శ్రీకర్, ఆర్‌హెచ్ మూర్తిలు ద్వితీయ స్థానాల్లోను, ఎం వినూత్న, సీహెచ్వీఎన్ సతీష్, కె లాస్య ఆద్విక, పిఎస్ సాత్విక్, బి సుశాంతలు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. కెడిట్ విభాగంలో ఆర్‌డి శ్రీలక్ష్మి, ఎస్‌జెసి దేవ్. ఎస్ సుదీప్, ఎంఎస్ శరణ్య, ఎబి చైతన్యలు ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన కె అన్య, ఎం మౌనిక, బీఎం ప్రితిక్‌లు వచ్చే నెల వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

పరిశ్రమల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం

- విజయవంతంగా ముగిసిన కోరమాండల్ మాక్ డ్రిల్
- ఈ ఏడాది మార్చి నాటికి అన్ని పరిశ్రమల్లో మాక్ డ్రిల్స్ పూర్తయ్యేలా చర్యలు
- కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లాలో పరిశ్రమల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని విపత్తు నిర్వహణ ప్రణాళికల అమల్లో భాగంగా కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెట్ కంపెనీలో నిర్వహించిన మాక్ డ్రిల్ విజయవంతమైనట్లు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. గురువారం కాకినాడ గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని కోరమాండల్ కంపెనీలో రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎస్‌డీఎంఏ) ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో రసాయన విపత్తు ఆఫ్‌సైట్, ఆన్ సైట్ మాక్ డ్రిల్ జరిగింది. ఉదయం 8.30 గంటలకు నిర్వహణ సిబ్బంది పైపులైన్‌లో అమ్మోనియా లీకేజీని గుర్తించినప్పటి నుంచి ఉదయం 11.30 గంటలకు జిల్లా కలెక్టర్ క్లియర్ సిగ్నల్ ఇచ్చేంత వరకు మధ్యలో మూడు గంటల వ్యవధిలో కంట్రోల్ రూం నుంచి ట్యాంక్ అవుట్‌లెట్ వాల్వ్, పంప్‌ను వేరు చేయడం, అత్యవసర సర్వీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకోవడం, నిరంతరం నీటిని వెదజిమ్మడం, జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేయడం, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు డీపీఆర్‌వో సమాచారం అందించడం, హార్బర్ పేట ప్రజలను పునరావాస కేంద్రాలకు, ఆసుపత్రులకు తరలించడం, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం చేరుకొని లీకేజీని పూర్తిగా ఆపడం తదితర ఘటనలు చోటుచేసుకున్నాయి. మాక్‌డ్రిల్ అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మీడియాతో మాట్లాడారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ), ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎస్‌డీఎంఏ) మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశ్రమల్లో మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాకినాడలో అతిపెద్ద పరిశ్రమ అయిన కోరమాండల్ కంపెనీలో విపత్తు నిర్వహణ, ఫ్యాక్టరీస్, రెవెన్యూ, పోలీస్, కాలుష్య నియంత్రణ, పురపాలక, వైద్య ఆరోగ్యం తదితర విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి మాక్‌డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. కంపెనీ కార్యకలాపాల కోసం నాలుగు ట్యాంకుల్లో 24 వేల మెట్రిక్ టన్నుల వరకు అమ్మోనియా ఉంటుందని. ఒకవేళ ప్రమాదవశాత్తు అమ్మోనియా లీకైతే యుద్ధప్రాతి పదికన తీసుకోవాల్సిన భద్రతా, విపత్తు నిర్వహణ చర్యలపై డ్రిల్ నిర్వహించినట్లు వెల్లడించారు. ఎన్‌డీఆర్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ విభాగాల అధికారులు కూడా ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. ఫాక్టరీకి తూర్పున ఉన్న హార్బర్ పేట నుంచి 220 మందిని పునరావాస శిబిరాలకు, ఆసుపత్రులకు తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్‌పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, కాకినాడ ఆర్‌డీవో బీవీ రమణ, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ జహీద్ ఖాన్, ఎన్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మొహమ్మద్ అస్లాం, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, ప్లాంట్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు, డీఎఫ్‌వో సురేంద్ర ఆనంద్, డీపీఆర్‌వో పి రవి, కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ అశోక్ కుమార్, డీఎంహెచ్‌వో డా ఎం శాంతిప్రభ, కాకినాడ గ్రామీణ తహసీల్దార్ మురార్జీ, కోరమాండల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎసిఎల్‌లో మాక్ డ్రిల్

విశాలాంధ్ర - రావులపాలెం : మండల పరిధిలోని ఈతకోట లోని ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ పరిశ్రమలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ సూచనల మేరకు మాక్ డ్రిల్ నిర్వహించారు. వివిధ ప్రమాదాల సమయంలో చేపట్టే చర్యలపై ఫ్యాక్టరీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎల్పిజి గ్యాస్ లీక్ కేజీ సమయంలో చేపట్టే చర్యలపై యూనిట్-1లో మాక్ డ్రిల్ మరియు సాల్వెంట్ అగ్నిప్రమాద సమయంలో చేపట్టే చర్యలపై యూనిట్-2లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ సీనియర్ జీఎం బి. శ్రీనివాసరావు, హెచ్‌పిడి హెడ్ పి.సుబాకర్, ప్రొడక్షన్ హెడ్ వై. ప్రవీణ్ కుమార్, మెటీరియల్ హెడ్ ఎస్. శ్రీనివాసరాజు, సేఫ్టీ ఆఫీసర్ పి. కోటేశ్వరరావు, ఫ్యాక్టరీ కార్మికులు పాల్గొన్నారు.

త్వరలో కార్యరూపం దాల్చనున్న సీతానగరం సీహెచ్‌సీ

విశాలాంధ్ర - సీతానగరం : సీతానగరం పీహెచ్‌సీ స్థానంలో నిర్మించనున్న 30 పడకల కమ్యూనిటీ ఆసుపత్రి త్వరలోనే కార్యరూపం దాల్చనుందని ఎమ్మెల్యే రాజా తెలిపారు. పీహెచ్‌సీని సీహెచ్ సీగా అప్ గ్రేడ్ చేయడానికి నిరంతరం కృషిచేస్తున్నానని బుధవారం కూడా ముఖ్యమంత్రిని కలిసి ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లానని రాజా వివరించారు. రఘుదేవపురం వద్ద రోడ్డును అనుకుని ఉన్న డీసీఎంస్ భూమిలో 30 పడకల ఆసుప్రతి నిర్మాణానికి కృషిచేస్తు న్నామని,త్వరలోనే కార్యరూపం దాలుస్తుందన్నారు. ప్రతీ మండలానికి కనీసం రెండు పీహెచ్సీలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించిందని, సీతానగరం పీహెచ్‌సీ సీహెచ్ సీగా మారుతున్నందున, బొబ్బిల్లంకలో 1.5 కోట్లతో పీహెచ్సీ ఏర్పాటు చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే రాజా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ రామచంద్ర రావు, కో కన్వీనర్ హరిబాబు, అర్ అండ్ బి డిఈ మధుసూదన్ రావు మొదలగు వైసీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల నెరవేరనుంది

విశాలాంధ్ర - సీతానగరం : దశాబ్దాల ములకల్లంక గ్రామ ప్రజల కల త్వరలో నెరవేరనుందని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో ఏకైక లంక గ్రామమైన ముల్లక ల్లంక గ్రామానికి గోదావరీ నది పై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం పురోగతిని గురువారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామ ప్రజల చిరకాల వాంఛ అయిన గోదావరి పాయపై నిర్మిస్తున్న బ్రిడ్జిని ఎట్టిపరిస్థితుల్లోనూ డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతున్నామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరికి వరదలు వచ్చే లోపు కనీసం పియర్ కాప్స్ పై వేసే బీంల వరకు పూర్తిచేస్తామన్నారు. వరద తగ్గాక శ్లాబ్ వేయాలని, డిసెంబర్ 31 నాటికి పనులు పూర్తిచేయాలని ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ పనుల్లో ఎవరూ అలసత్వం వహించినా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ రామచంద్రరావు, కో కన్వీనర్ హరిబాబు, కాంట్రాక్టర్ విశ్వేశ్వరరావు, డిఈ ధర్మ రాజు, జేఈ శ్రీనివాస్, ఇంజనీర్ చందు, వైసీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న పొలాలు పరిశీలించిన టీడీపీ బృందం



విశాలాంధ్ర - కాకినాడ : తాళ్ళరేవు మండలం పి మల్లవరం పంచాయతీ పరిధిలోని వరిపంటకు సాగునీరు లేని కారణంగా గత ఇరువై రోజులు నుంచి రైతులు చేస్తున్న ఆందోళన లను తెలుసుకున్న అమలాపురం పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్ స్వయంగా పంట భూములు పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొంటున్న నాయకులు రైతులను పంట విషయంలో నిండా ముంచేసారని, ఎకరాకు 25 వేల రూపాయలు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన లేని కారణంగా సాగునీరుకు ఇబ్బంది ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, మందాల గంగ సూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, జక్కల ప్రసాద్, ధూళిపూడి సుబ్బారావు, వుంగరాల వెంకటేశ్వర రావు, ధూళిపూడి రామకృష్ణ, దున్నా చంటి, మురళీ, సత్తికొండ, నిమ్మకాయల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను దూషించిన కేసులో నిందితులకు రిమాండ్

విశాలాంధ్ర - కాట్రేనికోన : ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్‌ను పరుష పదజాలంతో దుర్భాషలాడి, రెండు కులాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా వీడియోలను వాట్సప్, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారన్న ఆరోపణలపై నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం, సిద్దిపేటలో తలదాచుకున్న పల్లంకుర్రు శివారు చీకురుమిల్లివారిపేటకు చెందిన చీకురుమిల్లి రవి కుమార్, కాశీ దుర్గా ప్రసాద్‌లను గురువారం కాట్రేనికోన పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను ముమ్మిడివరం కోర్టు ముందు హాజరుపరచగా మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

వాణిజ్య సముదాయాల యూజర్ చార్జీలపై దృష్టి పెట్టండి

-వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలు
-ఇన్‌చార్జి కమిషనర్ నాగ నరసింహారావు

విశాలాంధ్ర - కాకినాడ : వాణిజ్య సముదాయాల నుంచి వసూలు కావలసిన యూజర్ చార్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని కాకినాడ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ సిహెచ్ నాగ నరసింహా రావు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఈ అంశంపై శానిటరీ ఇన్స్పెక్టర్లతో సమీక్షించారు. గృహ సముదాయాల యూజర్ చార్జీలు కొంత మేరకు బాగానే వసూలు అవుతున్నప్పటికీ వాణిజ్య సముదాయాల నుంచి బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయన్నారు. రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకుని నెలాఖరులోపు బకాయిలు వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ నాగ నరసింహారావు చెప్పారు. నోడల్ అధికారులు, ప్రత్యేక అధికారులను సమన్వయం చేసుకొని బకాయిలు వసూలయ్యేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. సహకరించని వాణిజ్య సముదాయాల యజమానులపై కఠిన చర్యలు తీసుకునేందుకు సైతం సిద్ధం కావాలన్నారు. యూజర్ చార్జీలను నిర్ధారించడంలో కొన్నిచోట్ల వ్యత్యాసాలు ఉన్నట్టుగా ఫిర్యాదులు ఉన్నాయని, వాటిని కూడా సరి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సచివాలయాల పరిధిలోని హూపర్ టిప్పర్ వాహనాలు ఉదయం 5:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకూ సేవలందించేలా పర్యవేక్షించాలని శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్వైజర్లు జిలాని, రాంబాబు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్య

విశాలాంధ్ర - గోకవరం: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటు న్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల అన్నారు. గురువారం మండల ముఖ్య కేంద్రమైన గోకవరంలో గల విద్యాసంస్థల ఫేర్వెల్ ఫంక్షన్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్ని వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, వారి వారి స్థాయిలను బట్టి చదువులు మధ్యలో అర్ధాంతరంగా ఆపివేయకుండా ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న విప్లవత్మక నిర్ణయాల వలన విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండల అధ్యక్షురాలు సుంకర శ్రీవల్లి వీరబాబు, గోకవరం జెడ్పీటీసీ సభ్యులు దాసరి శ్రీరంగ రమేష్, జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు(బాబు) తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్లు, పాలసీదారుల సమస్యలు పరిష్కరించండి : ఎంపీ వంగా గీత

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్, ఎల్ఐసి చైర్మన్ మంగళం రామసుబ్రహ్మణయన్ కుమార్‌శ్రీఖ ముంబాయి కేంద్ర కార్యాలయంలో కలిసి ఎల్ఐసి ఏజెంట్ల మరియు పాలసీదారుల సమస్యలపై లేఖను సమర్పించారు. ఏజెంట్ల గ్రాట్యుటీని రూ.3 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచడానికి అనుమతి మంజూరు చేయాలని, కోవిడ్ 19 కారణంగా దాదాపు 3500 మంది ఎల్ఐసి ఏజెంట్లు ప్రాణాలు కోల్పోయారని, వారిలో 60 ఏళ్ల నిండిన ఏజెంట్లు కూడా ఉన్నారని వారు మెరుగైన గ్రాట్యుటీ ప్రయోజనాన్ని కోల్పోయారని. దీనికి కనెక్ట్ చేసే ఫైల్‌లు 2018 నుండి ఆర్థిక మంత్రిత్వ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నదని, ఈ విషయంలో ఎల్ఐసి ఏజెంట్లకు సంబంధించిన సమస్యలను పరిశీలించి, వీలైనంత త్వరగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర - కొత్తపేట : ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్తపేట ఎస్సై వి. మణికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని బిళ్లకూరు గ్రామం సత్తమ్మ కాలనీకి చెందిన రుద్ర రాజరాజేశ్వరి(28) తన భర్త వెంకటనారాయణతో తరచూ త్రాగుడు విషయంలో గొడవలు పడుతున్నారు. భర్తకు త్రాగుడు మానాలని ఎన్నిసార్లు చెప్పినప్పటికీ మారకపోవడంతో రాజేశ్వరి మనస్తాపం చెంది గురువారం వంటగదిలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంతలో పక్క పోర్షన్లో ఉంటున్న బంధువులు చూసి భర్తకు సమాచారం ఇచ్చారు. మృతురాలికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై మృతురాలి తండ్రి కుప్పాల శివరామ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

జీవనోపాధిని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - రాజానగరం : డ్వాక్రా సంఘాలకు వివిధ బ్యాంకుల ద్వారా ప్రభుత్వాలు అందిస్తున్న జీవనోపాధిని సద్వినియోగం చేసుకోవాలని అందుకు సంఘం సభ్యులు సహకరించాలని డిఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సుభా షిణి అన్నారు. ఏపీఎండిఆర్డీఏ వైస్సార్ క్రాంతి పథకం ఎపిఎం కె.హేమ నాగలక్ష్మితో కలిసి మండలంలోని శ్రీరామపురం గ్రామంలో నూతనంగా వివిధ సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణాలను గురువారం పరిశీలించారు. లబ్ధిదారులు తెలిపిన వివరాల మేరకు వివిధ పండ్ల తోటలు,ఆవులు,టెంట్ హౌస్,తదితర జీవనోపాధి కార్యక్రమాలు పరిశీలించారు. సంఘ పనితీరు అంతర్గత అప్పులు నిర్వహణ,పుస్తకాలు నిర్వహణ పరిశీలించారు. బ్యాంకులకు తిరిగి రికవరీ కడుతున్నారు అనే అంశాలను సభ్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు లింకేజీ డిపిఎం గణేష్,ఎపిఎం కె.హేమ నాగలక్ష్మి, సీసీ కన్నబాబు,సీసీఎల్సి సింహాచలం, అకౌంటెంట్ నాని, వివోఏ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టు, విద్యుత్ స్తంభాలను ఢీ కొట్టిన లారీ

విశాలాంధ్ర - మామిడికుదురు : నిత్యంరద్దీగా ఉండే 216 జాతీయ రహదారి పై గురువారం ఉదయం లారీ బీభత్సం సృష్టించింది. అమలాపురం నుండి రాజోలు వైపు వెళు న్నాతారు. డబ్బాల లారీ మామిడికుదురులోని పోలీసు స్టేషన్, తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీ కొట్టి వేగంగా దూసుకెళ్ళి కొబ్బరి చెట్టును ఢీ కొట్టి కార్యాలయం ఆవరణలోకి దూసుకెళ్ళింది. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో రెండు విద్యుత్ స్తంభాలు పూర్తిగా ధ్వంసం కాగా, ఒక కూల్ డ్రింక్ షాపుకి సంబంధించిన షెడ్డు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఒక కొబ్బరి చెట్టు వేళ్ళతో సహా పైకి లేచి పోయి రెండు ముక్కలైంది. తహసిల్దార్ కార్యాలయం ఆవరణలోకి చొచ్చుకెల్లిన లారీ ఇసుక దిబ్బలలో దిగబడిపోయి ఆగింది. లేదంటే తహసిల్దార్ కార్యాలయాన్ని కూడా ఢీ కొట్టేదని స్థానికులు పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో డ్రైవర్, క్లీనర్‌కి గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారు కావడానికి ప్రయత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. అతికష్టం మీద లారీలో చిక్కుకున్న క్లీనర్‌ను బయటకి తీశారు. విద్యుత్ సరఫరా పునరుద్దరణకు అధికారులు చర్యలు చేపట్టారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఉచిత భోజనం

విశాలాంధ్ర - పిఠాపురం : ప్రతీ గురువారం కూరగాయలు మార్కెట్ వద్ద టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే వర్మ ఆర్థిక సాయంతో బాటసారులకు ఉచిత భోజనం అందిస్తున్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక టీడీపీ ప్రభుత్వంలో 5 రూపాయలకు భోజనం అన్నా క్యాంటీన్లు రద్దు చేసి, పేదవాడి పొట్టకొట్టిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ పేదవాడికి నోటి దగ్గర కూడు లేకుండా చేసిందని అన్నారు. వర్మ ఆధ్వర్యంలో ప్రతీ గురువారం పేదవారికి భోజనం పెడుతున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నామ దొరబాబు, సోము సత్యనారాయణ, చవ్వకుల రామ చంద్రరావు, మట్ట గణేష్, శివాల పాపారావు, మరియు, చల్లా అప్పలచారి, రాపర్తి రెడ్డి, లవుడు శ్రీను మరియు తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దాళ్వా పంటకు పూర్తిస్థాయిలో నీటిని అందించాలి

విశాలాంధ్ర - కరప : దాల్వా పంటకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు పేర్కొన్నారు. గురువారం కరప మండలంలోని గురజానపల్లి, వలసపాకల, విజయ రాయుడుపాలెం, పెద్దాపురపాడు, యండమూరు తదితర గ్రామాలలో నీరు అందని పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం వలసపాకల గ్రామం చేరుకుని కౌలు రైతులతో సమావేశం వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాల్వా పంట సిరి పొట్ట దశకు వచ్చే సమయంలో నీరు అధికంగా అవసరమవుతుందని అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తిగా దృష్టి పెట్టి నీరు అందించేందుకు త్వరలో చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఐదువేల ఎకరాలలో నీటి ఎద్దడి తలెత్తిందని కాజులూరు తాళ్ళరేవు మండలాల్లో కూడా ఈ సమస్య జటిలంగా ఉందని నివారించే బాధ్యత అధికారులదేనని ఎం. హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, కౌలు రైతులు కట్ట తిరుపతిరావు, కట్ట రంగారావు, సూరంపూడి తిరుపతిరావు, దెయ్యాల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రీడాపోటీలకు సుంకర ఫౌండేషన్ సన్నాహాలు

విశాలాంధ్ర - రాజానగరం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు,బాలికలకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించేందుకు సన్నద్ధమైనట్లు డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు అన్నారు.మండలంలోని దివాన్ చెరువు గ్రామంలో తమ కార్యాలయం ప్రగణంలో మహిళ దినోత్సవం సందర్భంగా మార్చి8వ తేదీన బాలికలకు,మహిళకు క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు.అశక్తి ఉన్న మహిళకు పూర్తి వివరాలు తమ సంస్థ నంబర్లుకి ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8328229133, 9505352866, 9912823489, 9133626188 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వాణిజ్య విభాగం అధ్యక్షునిగా ఎస్ఎస్ నియామకం

విశాలాంధ్ర - అనపర్తి :వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన పార్టీ జిల్లా అనుబంధ విభాగాల నియామకంలో భాగంగా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులుగా సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ ఎస్) నియమితులయ్యారు. స్థానిక పంచాయతీ పాలకవర్గ సభ్యులుగా ఉంటూ పార్టీకి విశేష సేవలు అందిస్తున్న అనపర్తి కి చెందిన సత్తి శ్రీనివాస్ రెడ్డి కి జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్ష పదవి దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సత్తి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ప్రత్యేక గుర్తింపు,పదవులు వాటికవే లభిస్తాయని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సేవే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నారని ఆయనకు అండగా నిలబడి మనమంతా పార్టీ కోసం మరింత కష్టపడి పని చేయాలని పార్టీ శ్రేణులకు జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు ఎస్ ఎస్ విజ్ఞప్తి చేశారు. నూతనంగా నియమితులైన శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), జెడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, అనపర్తి పట్టణ టౌన్ అధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణా రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పదాల శ్రీనివాసరెడ్డి, సర్పంచులు వారా కుమారి, గొల్లు హేమ తులసి (కుతుకులూరు), ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి (పొలమూరు), సత్తి కాటవరెడ్డి బ్రదర్స్, గావు గంగమ్మ కమిటీ అధ్యక్షులు సత్తి తాతారెడ్డి (తాతన్న), సత్తి గంగాధర్ రెడ్డి తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులకు విస్తృత సేవలు అందించాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్: కార్మికులకు విస్తృత సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని పార్టీ పరంగా నూతనంగా నియమితులైన ట్రేడ్ యూనియన్ కమిటీ జిల్లా అధ్యక్షులు మార్రోజు గణేష్ ను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. ట్రేడ్ యూనియన్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన గణేష్ గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీపరంగా అనుబంధ కమిటీలను నియమించినట్టు తెలిపారు. కార్మికుల జీవితాలకు భద్రత కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భవిష్యత్తులో కూడా వారికి మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేసే విధంగా రూట్ మ్యాప్ తయారు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, జెడ్పీటీసీ సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, ఏ ఎం సి మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా ఆవిర్భావ వేడుక

విశాలాంధ్ర-కుక్కునూరు : ప్రజా పంథా ఆవిర్భావ దినోత్సవాన్ని కుక్కునూరు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. 2022 ఫిబ్రవరి 22 న సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అతివాద విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజాపంథా ఆవిర్భవించినట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ప్రజాబంధు ఆవిర్భవించి ఏడాదైన సందర్భంగా ప్రథమ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నిర్వహించింది. కురుములతోగు, నెమలిపేట, చీపురుచెలక, తదితర 20 గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆ పార్టీ జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కే గౌస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బాసిన సత్యనారాయణ, కల్లయ్య,మడకం మల్లేష్, కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

విశాలాంధ్ర,జంగారెడ్డిగూడెం: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం బాలికల ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ చైర్ పర్సన్ కోడూరి రాధాపుష్పవతి విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనరుస్తున్న నలుగురు విద్యార్థినులకు,క్రీడా రంగంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ముగ్గురు విధ్యార్థినులకు మానవత సంస్థ తరపున షీల్డ్, సర్టిఫికెట్, పెద్దబాల శిక్ష లను బహుమతి గా అందచేశారు. ఈ కార్యక్రమంలో మానవత రీజనల్ చైర్మన్ దల్లి రామాంజనేయ రెడ్డి, ఉపాధ్యక్షురాలు త్రిపుర రమేష్, కోశాధికారి పల్లి వెంకటరెడ్డి, సీనియర్ సభ్యులు కుమార్ రాజా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.గ్లోరి ప్రశాంతి,ఉపాధ్యాయులు ఎం.ప్రమీలా రాణి కే .సుబ్బలక్ష్మి , సి హెచ్. నాగదుర్గ , ఎం.వెంకట లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

విశాలాంధ్ర -ఏలూరు: తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఉదయం గం.10.30 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఏలూరు ఆర్ ఆర్ పేట విద్యుత్ భవన్ నందు అవగాహన సదస్సు నిర్వహిస్తామని సీ.జీ.ఆర్.ఎఫ్ చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి బి. సత్యనారాయణ , ఏలూరు ఈ ఈ టి. శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లులో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, నియంత్రికల మార్పిడి తదితర ఫిర్యాదులు అందించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీ.జీ.ఆర్.ఎఫ్ చైర్మన్ తో పాటు సభ్యులు హరిబాబు, పి. శ్రీనివాస్, బాలాజీ ప్రసాద్ పాండే తదితరులు పాల్గొంటారని తెలిపారు.

లలిత కళలతోనే సామాజిక చైతన్యం

విశాలాంధ్ర -భీమవరం: ప్రపంచ ఇంద్రజాల దినోత్సవాన్ని పురస్కరించు కుని శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో గురువారం డిఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో మ్యాజిక్ స్టార్ బోస్ ను ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంజనీ కుమార్ మాట్లాడుతూ లలిత కళాలతోనే సామాజిక చైతన్యమని, కళలు మానసిక ఉల్లాసానికి ఆనందానికి దోహదపడతాయన్నారు. మన ప్రాంతానికి చెందిన మ్యాజిక్ స్టార్ బోస్ ఇంద్రజాల రంగానికే గర్వకారణమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మ్యాజిక్ స్టార్ బోస్ డిఎన్నార్ కళాశాల వ్యవస్థాపకులు దంతులూరి నారాయణరాజు కుటుంబీకులని, 55 సంవత్సరాల ఇంద్రజాల కళలో సుదీర్ఘ చరిత్ర సాధించి మ్యాజిక్ స్టార్ బోస్ ప్రసిద్ధికి ఎక్కరన్నారు. ఇటీవల గోవాలో గ్లోబల్ స్కాలర్స్ ఫౌండేషన్ భారత కళ రత్న అవార్డుతో సత్కరించారని, ఈ సందర్భంగా బోస్‌ను ఘనంగా సత్కరించామని తెలిపారు. కళాశాల గ్రంధాలయ అధికారిణి కె.శిరీష, రంగస్థల నటులు చుక్కనశ్రీ, రిటైర్డ్ పీఈటి గొట్టుముక్కల బంగ్రరాజు, బోస్ కుటుంబ సభ్యులు గాదిరాజు రామరాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా వైఎస్ఆర్‌సీపీలో ఇరువురికి పదవులు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఏలూరు జిల్లా వైయస్సార్సీపి లో ఉంగుటూరు మండలానికి రెండు పదవులు దక్కాయి. ఏలూరు జిల్లా వైసీపీ పంచాయతీ రాజ్ సెల్ అధ్యక్షులుగా కైకరం గ్రామానికి చెందిన పుప్పాల గోపీ కి పదవి దక్కింది. ఉంగుటూరు గ్రామానికి చెందిన దొంతంశెట్టి సత్యనారాయణ ను వీవర్స్ సెల్ అధ్యక్షులుగా నియమించారు. రాష్ట్ర వైఎస్సార్సీపీ అనుబంధ విభాగం కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వీరిద్దరికీ పదవులు ఇస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో ఇద్దరికి పదవులు కల్పించడం పట్ల మండలంలో సర్పంచులు ,ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి జగన్ బీసీల పక్షపాతి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి జగన్ బీసీల పక్షపాతి అని పశ్చిమ డెల్టా బోర్డు చైర్మన్ గంజి మాల దేవి అన్నారు. గురువారం ఆమె వైసిపి కార్యాలయంలో స్థానిక మహిళ నాయకులతో కలిసి పాత్రికేయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాదయాత్రలో వాగ్దానం చేసిన భాగంగా ఎమ్మెల్సీలలో 11 మంది బీసీలకు ఇచ్చి బీసీల పక్షపాతిగా నిలిచారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అనేక విమర్శలు గుప్పిస్తున్నారని వాటన్నింటినీ ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు మట్ట వనజ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి శాశ్వత సమాధి కడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ పి టి సి సభ్యులు ఘంటసాల సీనమ్మ, రాష్ట్ర హిస్టరీ అకాడమీ డైరెక్టర్ చిక్కాల మంగతాయారు, రాష్ట్ర ఫిషరీస్ డైరెక్టర్ గుబ్బల, మహిళా నాయకురాలు తోట కల్యాణి, పైలా జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరుకు రీసర్వే పనులు పూర్తి

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం : భీమవరం డివిజన్లో చేపట్టిన భూ రీసర్వే పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు.గురువారం వెలగపూడి సచివాలయం నుండి ఎపి భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి.సాయి ప్రసాద్ రాష్ట్రంలో చేపట్టిన భూ రీ సర్వే పనులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరం డివిజన్లోని 128 గ్రామాల్లో భూ రీ సర్వే పనులు చేపట్టాల్సి ఉండగా 47 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, ఇంకా 81 గ్రామాల్లో సర్వే మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గ్రౌండ్ కంట్రోల్ పాయింట్స్ 94 గ్రామాల్లో పూర్తయ్యాయని, ఇంకా 34 చేయాల్సి ఉందన్నారు. సర్వే హద్దు రాళ్ళు 10 వేలు వచ్చాయని రానున్న 15 రోజుల్లో రాళ్ళు పాతే పనిని పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, డిఆర్ఓ కె.కృష్ణవేణి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర -చింతలపూడి : నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ చింతలపూడిలో శిక్షణ ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమం లో భాగంగా చింతలపూడి ఎం.పి.డి.ఒ మణి కుమారి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలోని మొదటి ఫేస్ లో భాగంగా ఏర్పాటు చేసిన చింతలపూడి స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు గాను శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శిక్షణ ధ్రువ పత్రం,ఉద్యోగ నియామక పత్రం అందజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజి రావు మాట్లాడుతూ శిక్షణ పర్తి చేసుకున్నవారు వీల్స్ ఇండియా లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, మోహన్ స్పింటెక్స్ కంపెనీలకు 30 మంది అబ్యార్ధులు ఎంపికయి నియామక పత్రాలు అందుకున్నుట్లు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.వి కృష్ణ మోహన్ మాట్లాడుతూ చింతలపూడి స్కిల్ హబ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి వారి ఆధ్వర్యంలో ఇంత మందికి ఉపాధి కల్పించడం చాల ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జి.ప్రవీణ్, వై.పి-ఎంప్లాయిమెంట్ ఆఫీస్, స్కిల్ డెవలప్మెంట్ సిబ్బంది కిషోర్, సత్యనారాయణ కార్తీక్, నరసరాజు కళాశాల సూపరింటెండెంట్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రంగనాధరాజును కలిసిన జిల్లా వీవర్స్ అధ్యక్షుడు

విశాలాంధ్ర-పోడూరు : పశ్చిమగోదావరి జిల్లా వీవర్స్ అధ్యక్షునిగా నియమితులైన అందే నాగబసవన్న గురువారం తూర్పు పాలెం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చెరుకు వాడ శ్రీరంగనాథ రాజును మర్యాద పూర్వకంగా కలిసి తన ఎంపికకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ రంగనాధరాజు నాగ బసవన్నను అభినందించారు.ముఖ్యమంత్రి జగన్ అమలుపరుస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని,పార్టీ పటిష్టతకు కష్టపడి పని చేయాలని సూచించారు.

ఆలమూరులో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు మండలం పాలమూరు గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం జరిగింది. టిడిపి నాయకులు గ్రామం లో ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజల సమస్యలను నమోదు చేసుకున్నారు. రాబోయే కాలంలో తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ సెక్రటరీ పాముల రజని కుమార్, ఇంచార్జ్ ఇంటి శ్రీరాములు, తెలుగు యువత అధ్యక్షులు నీలం తాతాజీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు పణతుల మణిబాబు, పణతుల సూరిబాబు, బొక్క శ్రీనుబాబు, బుంగ జయప్రకాష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్ పాలన చూసి ఓర్వలేక టీడీపీ అల్లర్లు

విశాలాంధ్ర-తణుకు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సుపరిపాలన చూసి ఓర్వలేక రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించి తద్వారా రాజకీయ లబ్ది పొందాలని టిడిపి అధినేత చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని వైసిపి సోషల్ మీడియా విభాగం జిల్లా కో కన్వీనర్ బుడితి సుజన్ కుమార్ ధ్వజమెత్తారు. కుట్రలలో భాగమే గన్నవరం లాంటి ఘటనలన్నారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మాత్రమే వాడుకుని వదిలేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు.ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పోరాడి, ప్రజల పక్షాన బాసటగా నిలిస్తే ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకుంటారని, అధికార దాహం తీర్చుకోవడానికి ప్రజలు ముందు నాటకాలు ఆడితే తరిమి తరిమి కొడతారని హెచ్చరించారు.

రోజువారి ఆశీలకు బహిరంగ వేలం పాట

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ పరిధిలో 2023-24 సంవత్సరానికి గాను రోజువారి మార్కెట్, వారపు సంత,జంతు వధ శాల యందు రుసుములు వసూలు చేసుకునే హక్కులకు సంబంధించి బహిరంగ వేలం ను మార్చి 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి. భవాని ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు రోజువారీ మార్కెట్ కు రూ .15లక్షలు, కబేళా కు రూ.లక్ష రూపాయలు డి డి రూపంలో మార్చి ఒకటవ తేదీ లోపు చెల్లించి కార్యాలయంలో అందచేసిన వారు మాత్రమే వేలం లో పాల్గొనడానికి అర్హులన్నారు. బహిరంగ వేలం లో పాల్గొనటానికి రూ.2వేలు ఎంట్రీ ఫీజుగా చెల్లించాలని, మరిన్ని వివరాలు స్థానిక మున్సిపల్ కార్యాల యంలో రెవెన్యూ విభాగంలో తెలుసుకోవాలని సూచించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ చర్యలు శూన్యం

విశాలాంధ్ర-తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, విద్యాభివృద్ధికి నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం సాయి కుమార్ ఆరోపించారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు, శిధిలమైన కళాశాల భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కనీసం తరగతుల నిర్వహణకు కూడా రూం లు లేక బాలికల వసతి గృహంలో లో ఆర్ట్స్ విద్యార్థులకు తరగతులు నిర్వహించడం శోచనీయమన్నారు. శిధిలావస్థకు చేరిన డిగ్రీ కళాశాలలో కనీస సదుపాయాలు, అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు నానావస్థలు పడుతున్నారని, బాలికల వసతి గృహాల్లో క్లాసులు జరపడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. వసతి గృహాల్లో ఉన్న బాలికల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వేరే చోట పెట్టడమేమిటని, వారికి జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని సాయి కుమార్ ప్రశ్నించారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీ మరిడమ్మ తల్లి జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండలంలోని ఠానేలంక పంచాయతీ వడ్డిగూడెంలో 12 గ్రామాల గ్రామదేవత శ్రీ మరిడమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవములు గురువారం ఘనంగా ప్రారంభమ య్యాయి. ఏడు సంవత్సరాల ఏడు నెలల ఏడు రోజులకు వచ్చే అమ్మవారి జాతర మహోత్సవాలను తిలకించేందుకు 12 గ్రామాల నుంచి ప్రజలే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గురువారం నుంచి మూడు నెలల వరకు అమ్మవారి జాతర మహోత్సవములు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ వారు తెలిపారు.

భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - చాగల్లు : మండల కేంద్రం చాగల్లు శ్రీ రాజరాజేశ్వరి దేవాల యం ప్రక్కన ఉన్న శిరిడి సాయినాథ స్వామి ప్రాంగణంలో 20వ వార్షికోత్సవ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్న సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 19 సంవత్సరాల నుండి షిరిడి సాయి నాధుని ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తుల సహకారంతో ఉత్సవాలు నిర్వహించి ఆఖరి రోజున అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అన్న సమారాధనలో సుమారు 3000 మంది భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షునిగా కటకంశెట్టి ఆదిత్య

విశాలాంధ్ర - మామిడికుదురు : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా మామిడికుదురుకు చెందిన కటకంశెట్టి విజయధర్మ ఆదిత్యకుమార్ (విజ్జి బాబు)ను నియమించారు. దీనికి సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులను నియమించామని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆదిత్యకుమార్ ప్రస్తుతం నగరం పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. జిల్లా అధ్యక్షునిగా నియమితులైన ఆదిత్యకుమార్ గురువారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా తనను నియమించేందుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలకు. ఆదిత్యకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని, పార్టీ నేతల ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని ఆదిత్యకుమార్ స్పష్టం చేశారు.

వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-కొవ్వూరు : వికాస కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక కొవ్వూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.సునీత బుధవారం తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్ లో డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్) ఉద్యోగానికి బి.ఎస్సి కెమిస్ట్రీ, బి.జెడ్.సి, ఎం.పి.సి & సి.బి.జెడ్ గ్రూప్స్ 2017 నుండి 2022 సంఎల్లో ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.19,477 జీతం, భోజనం, వసతి,రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. నిట్ (ఐసీఐసీఐ) బ్యాంక్ లో రిలేషన్ షిప్ మేనేజర్, సీనియర్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 25 సంఎలోపు అభ్యర్థులు అర్హులు. అంతేకాక డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కుడా అర్హులు వీరికి సంవత్సరానికి 2.4 నుండి 3.1 లక్షల వరకు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 25వ తేదీ శనివారం కొవ్వూరు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ వద్ద ఉదయం 10.00 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్ లతో హాజరు కావలెను. మరిన్ని వివరాలకు 8309010013 సంప్రదించాలని సునీత పేర్కొన్నారు.

చౌకబారు విమర్శలు తగదు

విశాలాంధ్ర - కొత్తపేట : కార్యకర్త నుండి రాష్ట్ర అధ్యక్షుడు వరకు ఎదిగిన సోము వీర్రాజు పై మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ చౌకబారు విమర్శలు చేయడం తగదని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు సంపత్ కనకేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో ఒకే పార్టీ ఒకే జెండా మోస్తూ నాలుగు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీలో ఒక నిబద్ధత నిజాయితీ కలిగిన నాయకుడిగా పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర అధ్యక్షుడు స్థాయి వరకు ఎదిగిన గొప్ప వ్యక్తి సోము వీర్రాజు అన్నారు. అటువంటి వ్యక్తిపై మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. పార్టీ మారే ఉద్దేశం ఉన్నప్పుడు గౌరవప్రదంగా పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోవాలి గాని పార్టీని, పార్టీలో వ్యక్తులపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని వేరే పార్టీ నుండి వచ్చినప్పటికీ భారతీయ జనతా పార్టీ కన్నా లక్ష్మీనారాయణ ఒక ఉన్నత స్థానం కల్పించిందని అటువంటి పార్టీని పార్టీలో వ్యక్తుల్ని విమర్శించడం కన్నా స్థాయి ఏమిటో అర్థం అవుతుందని పబ్బం గడుపుకోవటానికి ఇటువంటి విమర్శలు తగదని సంపతి అన్నారు.

ధర్మవరం-గుత్తి డబ్లింగ్ విద్యుద్దీకరణ ప్రాజెక్ట్ పూర్తి

విశాలాంధ్ర-విజయవాడ : రైల్వే శాఖ చివరి దశలో ఉన్నా ప్రాజెక్టులపై దృష్టి సారించడంతో మరో ముఖ్యమైన ప్రాజె క్టును అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రంలో డబ్లింగ్, విద్యుదీకరణను పూర్తి చేసుకున్న మరో కీలకమైన ప్రాజెక్ట్ అయిన చిగిచెర్ల నుండి ధర్మవరం మధ్య విభాగాన్ని డబ్లింగ్‌ను పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకువచ్చారు. దాంతో గుత్తి నుంచి ధర్మవరం వరకు 90 కిలోమీటర్ల మేర ఇప్పుడు డబుల్ రైల్వే లైన్ కనెక్టివిటీతో విద్యుద్దీకరించబడింది.గుత్తి - ధర్మవరం డబ్లింగ్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఒక ప్రాముఖ్యమైన రైలు లింక్, ఇది దక్షిణ భారత రాష్ట్రాలకు ఒక ప్రవేశ ద్వారంగా కుడా పనిచేస్తుంది.ఈ లైన్ రెండు తెలుగు రాష్ట్రాలను బెంగుళూరు, కర్ణాటక రాజధాని నగరం వెలుపల కలిపే ముఖ్యమైన మార్గాలలో ఒకటిగా పనిచేస్తుంది.

యువత దేశాభివృద్ధికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలి

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : విద్యా వనరులను సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు యువత చేయాలని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే తెలిపారు. ఉల్కాస్ జీ ఉత్సవాల్లో భాగంగా ఏపీ నిట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తిరుపతి జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఇస్రో)కి చెందిన మొబైల్ వాహనాన్ని (స్పేస్ ఆన్ వీల్స్ ప్రోగ్రాం) ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రమోద్ పడోలే మాట్లాడుతూ కొత్త ఆలోచనలు విజయానికి దిక్సూచి వంటివని తెలిపారు. యువత నవ్యాలోచనలు, సాంకేతిక నైపుణ్యాలను రక్షణ రంగంలో వినియోగించి దేశ శక్తి, సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంలో పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. విక్రమ్ సారాబాయ్, సతీష్ ధావన్, అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తల స్ఫూర్తితో రాకెట్, సాటిలైట్ల లలో ఉపయోగించే పరికరాల తయారీపై దృష్టిసారించాలని విద్యార్థులకు వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ చదువు, మార్కులే ప్రాతిపదికగా కాకుండా విభిన్న ప్రాజెక్టులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నామని, ఇందుకు వారినుంచి అనూహ్య స్పందన వస్తుందని తెలిపారు. పోలార్ సాటిలైట్ వెహికల్ (పి.ఎస్.ఎల్.వి), జియో స్టేషనరీ సాటిలైట్ లంచ్ వెహికల్ (జి.ఎస్.ఎల్.వి), లాంచ్ వెహికల్ మార్క్ 3 (ఎల్.వి.ఎమ్ 3), రాకెట్ వాటి పరికరాల నమూనాలను ప్రదర్శించారు. తాడేపల్లిగూడెం చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులు భారీస్థాయిలో వచ్చి పరికరాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబి వీరేష్ కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ తలారి రేష్మా, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ టి.రమేష్, డాక్టర్ హైమావతి, డాక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి గురువారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌బీ మహిళా శిశు సంక్షేమం, అంగన్వాడీ ఖాళీలు ఇతర కార్యకలాపాలుబీ స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వస్తున్న అర్జీల పరిష్కారం తదితర అంశాలపై సీఎస్ జవహర్ రెడ్డి..కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టరు కృతికా శు క్లా..అధికారులతో మాట్లాడుతూ ఎస్డీజీ గోల్స్ లక్ష్యాల సాధనకు జిల్లాలో అన్ని శాఖల అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ సక్రమంగా అమలయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టరు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు కె.శ్రీరమణి, ప్రవీణ, డీఈవో అన్నపూర్ణ, డీసీహెచ్ఎస్ డా. విష్ణువర్ధని, డీసీ ఆరోగ్యశ్రీ డాక్టర్ పి. రాధాకృష్ణ, డిప్యూటీ డిఎం అండ్ హెచ్వో డా సరిత, డిఐవో ప్రభాకర్, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు తదితరులు హాజరయ్యారు. తొలుత రీ సర్వేపై సీసీఎల్ఎ జి.సాయిప్రసాద్, సర్వే కమిషనర్ సిద్దార్థ్ జైన్.. అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా.. జేసీ ఇలక్కియ ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికా శుక్లా జిల్లాలో జరుగుతున్న రీ సర్వే కార్యాచరణ ప్రణాళికను సిసిఎల్ఎకు వివరించారు. ఈ వీసీలో ఇన్‌చార్జి ఏడీ సర్వేయర్ బిబిబివి రాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రోమా మ్యాజికల్ సమ్మర్ పేరుతో రాయితీలు

విశాలాంధ్ర -రాజమండ్రి: ఓమ్నీ ఛానెల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్, టాటా గ్రూప్‌కు చెందిన క్రోమా, తమ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తోన్న సమ్మర్‌సేల్‌ను ప్రకటించింది. ఇది వినియోగదారులకు విస్తృత ఆఫర్లను హెూమ్ అప్లయెన్సస్‌పై అందిస్తుంది. క్రోమా లో విస్తృతశ్రేణి ఎయిర్ కండీషనర్లు, రూమ్ కూలర్లు, రిఫ్రిజిరేటర్లు పై 45 శాతం వరకూ తగ్గింపును వినియోగదారులు ఈ సమ్మర్ సేల్‌లో భాగంగా పొందవచ్చు. క్రోమా ఇప్పుడు విస్తృతశ్రేణి ఎయిర్ కండీషనర్లను ఎంచుకునేందుకు పరిచయం చేసింది. వినియోగదారులు 350కు పైగా ఏసీలు, 450 కు పైగా రిఫ్రిజిరేటర్లను ఎక్స్చేంజ్ అప్‌గ్రేడ్ ప్రయోజనాలు, క్యాష్‌బ్యాక్‌ఆఫర్లు, మరియు 18 నెలల ఈఎంఐ అవకాశాలతో పొందవచ్చు. స్ప్లిట్‌ఏసీలు కేవలం 27,990 రూపాయల నుంచి ప్రారంభమైతే, రూమ్ కూలర్లు 5,990 రూపాయలు మరియు క్రోమా ఫ్రాస్ట్ ఫ్రీ రిఫ్రిజిరేటర్లు 21,990 రూపాయలతో ప్రారంభమవుతాయని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు.

మార్చి 2 మహాధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ : టిడ్కో, జగనన్న ఇళ్ళ లబ్ధిదారులకు వెంటనే ఇళు ్ళ కేటాయించాలని కోరు తూ సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలో మార్చి 2వ తేదిన జరిగే 'మహాధర్నా'ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.హెచ్.కోటేశ్వరరావు పిలుపు నిచ్చారు. దాసరిభవన్‌లోని సీపీఐ జిల్లా కార్యాల యంలో 'మహాధర్నాపోస్టర్' పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీల నిర్మాణం చేపట్టిందన్నారు. అయితే ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సిమెంటు, స్టీల్, ఇటుకలు, ఇసుక, కంకర, కిటికీలు, తలుపుల ధరలు పెరగంతో ఆటు కూలీల ధరలు కూడా బాగా పెరిగాయని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జగనన్న ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఇంటికి పునాదులు వేయటానికే సరిపోవన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఆ మొత్తాన్ని రూ.5లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులు తక్షణం ఇంటి నిర్మాణం చేపట్టకపోతే రద్దు చేస్తాం అంటూ వలంటీర్లు బెదిరింపులకు పాల్పడున్నారని కాలనీల్లో మౌలిక సదుపాయాలైన రోడ్లు, కరెంటు, నీళ్లు లేకుండా ఏ విధంగా ఇల్లు నిర్మించుకుంటారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం వచ్చి మూడున్నరేళ్లు అయినా పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. టిడ్కో ఇళ్లను అన్ని వసతులతో పూర్తి వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయిం చాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ గత రెండు నెలలుగా వివిధ రూపాల్లో పోరాటం చేస్తుందన్నారు. ముందుగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిందని, ఇళ్ల నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయ్, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటీ అనే అంశాలను నేరుగా లబ్ధిదారులను కలిసి మాట్లాడామని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని దీక్షలు, నిరసనలు, ధర్నాలు చేశారన్నారు. అధికారులకు వినతి పత్రాలు అందించామని గుర్తుచేశారు. లబ్ధిదారుల నుంచి వారు సంతకాలు చేసి అర్జీలు స్వీకరించి అధికారులకు అందజేశామని చెప్పారు.

ఉద్యమంలో భాగంగా మార్చి 2వ తేదిన విజయవాడలో రాష్ట్రస్థాయి 'మహాధర్నా'ను చేపట్టినట్లు తెలిపారు. ఈ ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల లబ్ధిదారులు హాజరవుతారని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని మండల నుంచి లబ్ధిదారులు ఈ మహాధర్నాలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. జిల్లాలో సీపీఐ శ్రేణులు ఈ ధర్నాను జయప్రదం చేయటానికి సమాయత్తం కావాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు బుడ్డి రమేష్, లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, పంచదార్ల దుర్గాంబ పాల్గొన్నారు.